సాక్షి
బాపట్ల
బుధవారం । 3 । జూలై । 2024



మొక్కలు నాటే కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



విత్తన దుకాణాల తనిఖీ

ఫిరంగిపురం: ఎరువులు, పురుగుమందులు, విత్తన విక్రయ దుకాణాలను మంగళవారం ఏవో వాసంతి తనిఖీ చేశారు. ఐదు లక్షల ఖరీదైన విత్తనాల విక్రయం నిలిపివేశారు.

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

నెరవేరనున్న దర్శిన భాగ్యం

- రెండురోజుల్లో దర్శి నుంచి రైలు సౌకర్యం
- గుంటూరు, సికింద్రాబాద్‌కు రైలు నడిపే అవకాశం
- పరిశీలించిన అధికారులు



సిద్ధమైన రైల్వే ట్రాక్



టికెట్ కౌంటర్



టాయిలెట్‌లు



ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

దర్శి: రెండు రోజుల్లో దర్శి నుంచి రైలు సౌకర్యం కల్పించేందుకు ఉన్నతాధికారులు మంగళవారం దర్శి రైల్వేస్టేషన్‌కు వచ్చి చర్చించారు. దర్శి నుంచి వినుకొండ, శావల్యాపురం, పిడుగురాళ్ల మీదుగా సికింద్రాబాద్‌కు, వినుకొండ, నరసరావుపేట మీదుగా గుంటూరుకు రెండు ట్రిప్‌లు లేదా ఈ రెండింటిలో ఒక ట్రిప్ సౌకర్యం కల్పించే ఆలోచనలో రైల్వే అధికారులు ఉన్నారు. అందులో భాగంగా టికెట్ కౌంటర్‌ను కూడా సిద్ధం చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్‌లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. కాంట్రాక్టర్లను రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న వస్తువులన్నీ తీసివేయాలని ఆదేశించారు. దీంతో రెండు రోజుల్లో రైలు వస్తుందన్న ఆశతో నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. కనిగిరి వరకు రైల్వేట్రాక్ పూర్తయినప్పటికీ దర్శి వరకు మాత్రమే ట్రైల్ రన్ చేశారు. దర్శి నుంచి పొదిలి, కనిగిరి మీదుగా శ్రీకాళహస్తి వరకు ఈ రైల్వేలైన్ పనులు చేస్తున్నారు. అవికూడా పూర్తయితే దూర ప్రాంతాల రైలు సౌకర్యాలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నాగసూరి వేణుగోపాల్‌కు 'పుట్టంరాజు' పురస్కారం

అద్దంకి: పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ పురస్కారాన్ని బహుగ్రంథ రచయిత, రేడియో ప్రయోక్త, పాఠ్యాంశాల రచయిత, వివిధ దినపత్రికల విశ్లేషకుడు నాగసూరి వేణుగోపాల్‌కు అందిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీన శ్రీనివాస ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోర్టు ఆదేశాలతో నిర్మాణ సంస్థపై కేసు

మార్టూరు: కాంట్రాక్ట్ పనులు చేయించుకుని బిల్లులు చెల్లించని సంస్థపై కేసు నమోదైంది. బాధితులు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి వివరాల మేరకు.. మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి ఎర్త్ మూవర్స్ యజమాని జొన్నలగడ్డ శ్రావణి మహారాష్ట్రకు చెందిన స్పేస్ ఇంజినీరింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని 2020లో నరసరావుపేట-రొంపిచర్ల మార్గంలో పైపులైను నిర్మాణ పనులు చేశారు. అందుకు సంబంధించి స్పేస్ ఇంజినీరింగ్ సంస్థ యజమాని పూనం యాదవ్ శ్రావణికి రూ.28 లక్షలు బకాయి పడ్డారు. తమ బిల్లులు చెల్లించాలని పూనమ్ యాదవ్, ఆమె భర్త సుఖదేవ్ వాసుదేవ్ యాదవ్‌లను శ్రావణి ఎన్నోసార్లు కోరారు. కాని వారు బిల్లులు చెల్లించకపోవడంతో శ్రావణి అద్దంకి కోర్టును ఆశ్రయించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన అద్దంకి కోర్టు పూనమ్ యాదవ్, సుఖదేవ్ వాసుదేవ్ యాదవ్‌లపై కేసు నమోదు చేయాలని మార్టూరు పోలీసులను ఆదేశించింది. ఈక్రమంలో మంగళవారం హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



అద్దంకి: బైకును లారీ ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి దుర్మరణం పాలవగా మరో వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈఘటన పట్టణంలోని కలవకూరు రోడ్డులోని వైఎస్సార్ అపార్ట్‌మెంట్ వద్ద బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన బండారు ఏసు బాబు (45), తాళ్లూరు అశోక్‌లు అద్దంకి వచ్చారు. ఈ క్రమంలో పనులు ముగించుకుని తిరిగి వెళ్లే సమయంలో బైకు అద్దంకి-కలవకూరు రోడ్డులోని వైఎస్సార్ అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకోగానే వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఏసుబాబు బైకు కిందపడింది. వాహనం నడుపుతున్న ఏసుబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడు అశోక్‌ను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాలికను మోసగించి వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు

కొల్లూరు: బాలికను ప్రేమ పేరుతో మోసగించి వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పోతార్లంకకు చెందిన పరిశ అజయ్ బాబు ఓ మైనర్ బాలికను ప్రేమిస్తున్నట్లు నమ్మించాడు. ఇంటర్‌వరకు చదువుకుని ఇంట్లోనే ఉంటున్న బాలికను వివాహం చేసుకుంటానని మాయమాటలతో నమ్మించి లైంగిక దాడి చేశాడు. అప్పట్నుంచి వివాహం చేసుకోవాలని బాలిక అడుగుతుండటంతో ఇరువురి కులాలు వేరుకావడంతో తమ తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోరని, ఎటైనా వెళ్లిపోయి వివాహం చేసుకుందామని చెప్పి ఏప్రిల్ 27న బాలికను తీసుకొని వెళ్లిపోయాడు. భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో రోడ్డు వెంబడి ఉన్న ఓ ఆలయంలో బాలికను వివాహం చేసుకున్నాడు. వీరి వివాహానికి అజయ్‌బాబు తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో నెలరోజుల పాటు బాలిక ఇంట్లోనే ఉన్నాడు. ఈక్రమంలో పోతార్లంకలోని తన ఇంటికి వెళ్లిన అజయ్‌బాబు తిరిగి రాకపోవడంతో బాలిక అక్కడికి వెళ్లిన తనతో రావాలని కోరింది. యువకుడితోపాటు, అతని తల్లి కాపురం చేసేది లేదని చెప్పడంతోపాటు, కులం పేరుతో దూషించి మళ్లీ తమ ఇంటికి రావొద్దని బెదిరించి పంపారు. అప్పట్నుంచి పెద్దమనుషుల సమక్షంలో చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేకపోవడంతో మంగళవారం కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి పోక్సో కేసు నమోదుచేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు
అన్నివిధాల అండగా ఉంటాం

- టీడీపీ దాడులకు దిగడం మంచి పద్ధతి కాదు
- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్
- బాధితుడు వెంకటేశ్వరావుకు ఆర్థిక సాయం అందజేత



వెంకటేశ్వరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్

చెరుకుపల్లి: చెరుకుపల్లి కస్తూరిపేటలో వైఎస్సార్ సీపీ నాయకుడు యెనుమల వెంటేశ్వరరావు ఇంటిని టీడీపీ నాయకులు ఇటీవల అక్రమంగా కూల్చివేసిన సంగతి తెలిసిందే. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మంగళవారం వెంకటేశ్వరావును పరామర్శించి, ధైర్యం చెప్పి, రూ.20వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ టీడీపీ నాయకుల అరాచకాలు రోజురోజుకి మితిమీరుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు దిగడం మంచి పద్ధతి కాదన్నారు. నియోజకవర్గంలో పరిస్థితులను మాజీ సీఎం, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళతానన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసానిచ్చారు.

గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి బదిలీ

నంద్యాల కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి



గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సుదీర్ఘ కాలం బాధ్యతలు నిర్వహించిన జి.రాజకుమారి బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా కలెక్టర్‌గా ఆమెకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాజకుమారి జిల్లాలో రెండేళ్ల 10 నెలలపాటు జేసీగా పనిచేశారు. 1999లో అనిల్ కుమార్ సింఘాల్ ఇక్కడ జేసీగా మూడేళ్ల సదీర్ఘ కాలం విధులు నిర్వర్తించారు. ఆయన తర్వాత ఎక్కువ కాలం పనిచేసిన జేసీగా రాజకుమారి నిలిచారు. ఆమె గతంలో ఈస్ట్ గోదావరి జేసీగా పనిచేస్తూ గుంటూరుకు వచ్చారు. ఈ మధ్య కాలంలో వివాదాలకు అతీతంగా ఆమె విధులు నిర్వహించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో మంగళగిరి రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. భూ రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

జిల్లా కలెక్టర్‌గా వెంకట మురళి

అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా జేసీ సీహెచ్ శ్రీధర్‌కు ఉద్యోగోన్నతి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా కలెక్టర్‌గా కె.వెంకటమురళి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌గా ఉన్న వెంకట మురళిను తాజా బదిలీల్లో భాగంగా బాపట్ల కలెక్టర్‌గా నియమించారు. అనంతపురం జిల్లాకు చెందిన వెంకట మురళి కుటుంబం 20 ఏళ్ల క్రితమే వైఎస్సార్ కడపజిల్లా, మైదుకూరులో స్థిరపడింది. ఆయన పాఠశాల విద్యాభ్యాసం అనంతపురంలో, గ్రాడ్యుయేషన్ ఉస్మానియాలో పూర్తిచేశారు. వెంకటమురళి 2010 నుంచి 2013 వరకు కర్నూల్ ఆర్డీఓగా పనిచేశారు. 2013 నుంచి 2015 వరకు విశాఖపట్టణం ఆర్డీఓగా పనిచేశారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వెంకట మురళి 2017 నుంచి 2019 వరకు విజయనగరం ఆర్డీఓగా, 2020 నుంచి 2022 ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, 2022 నుంచి 2023 వరకు పశ్చిమగోదావరి జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2023 నుంచి ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.



నూతన కలెక్టర్ జె.వెంకట మురళి

శ్రీధర్‌కు ఉద్యోగోన్నతి..

బాపట్ల జాయింట్ కలెక్టర్ చామకురి శ్రీధర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఏడాదిన్నర పాటు ఆయన బాపట్లలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు.

సైబర్ స్టాకింగ్ నేరాలపై అప్రమత్తత అవసరం

- అభ్యంతరకర సందేశాలను పంపి బెదిరింపులకు గురిచేయడమే సైబర్ స్టాకింగ్
- ఆన్‌లైన్‌లో పరిచయమయ్యేవారిని నమ్మి మోసపోవద్దు
- ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: సైబర్ స్టాకింగ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, ముఖ్యంగా యువతీయువకులు సోషల్ మీడియా వేదికల ద్వారా ఆన్‌లైన్‌లో పరిచయమయ్యేవారిని నమ్మి మోసపోవద్దన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక వ్యక్తిని, వ్యక్తుల సమూహాన్ని వేధించడానికి ఫొటోలు, వీడియోలు ఇతర అభ్యంతరకర సందేశాలను ఇ-మెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా పంపడం, పంపిస్తామని బెదిరించడం వంటివి సైబర్‌స్టాకింగ్ నేరాల కిందికి వస్తాయన్నారు. సైబర్ స్టాకింగ్ నేరాలు ముఖ్యంగా మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు.

పాటించాల్సిన నియమాలు..

ఏదైనా సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు ప్రైవసీ సెట్టింగ్‌ను సెట్ చేసుకోవడం మంచిది. స్నేహితుల అభ్యర్థనను అంగీకరించే ముందు సోషల్ మీడియాలో ఆ వ్యక్తి యొక్క ప్రామాణికతను తనిఖీ చేయాలి. అవసరం అయినప్పుడు మాత్రమే మొబైల్‌లోని జీపీఎస్ వినియోగించాలి. మిగిలిన సందర్భాల్లో ఎల్లప్పుడూ జీపీఎస్‌ను ఆపివేయాలి. సోషల్ మీడియాలో పరిచయమయ్యే ఆన్‌లైన్ స్నేహితులను నమ్మొద్దు. ఆన్‌లైన్‌లో పరిచయమైనవారికి ఫొటోలు, వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదు. ఫొటోలు, వీడియోలు ఆన్‌లైన్‌లో పోస్ట్ చేస్తున్నప్పుడు లొకేషన్‌ని ఎవరికీ షేర్ చేయరాదు. ఎవరైన సైబర్ స్టాకింగ్ నేరాలకు పాల్పడుతున్నా, పాల్పడతారని అనుమానం వచ్చిన ఆలస్యం చెయ్యకుండా వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలి. సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలి.

గీత దాటితే మోతే!

చోదకా.. ఇక జాగ్రత్త

- నూతన ట్రాఫిక్ చట్టం అమలులోకి తెచ్చిన కేంద్రం
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- మైనర్ వాహనం నడిపితే తల్లిదండ్రులు కటకటాల వెనక్కే..
- మద్యం మత్తులో వాహనం నడిపితే మూడేళ్ల జైలు
- అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోతే రూ.10 వేలు జరిమానా

వాహన చోదకుల నిర్లక్ష్యం, నిబంధనల బేఖాతరుతో ప్రతిచోటా ప్రమాదాలు నిత్యకృత్యమై.. ప్రతిరోజూ పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి..వీటికి అడ్డుకట్ట వేసేలా నిబంధనలు మరింత కఠినతరం చేస్తూ కేంద్రం నూతన చట్టాన్ని అమలులోకి తెచ్చింది. మైనర్ రైడింగ్.. ట్రిపుల్, ర్యాష్, స్నేక్ డ్రైవింగ్ ఇలా రకరకాల డ్రైవింగ్‌లతో తోటి చోదకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై ఈ చట్టం కొరడా ఝుళిపించనుంది.



ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న మైనర్లు

వేటపాలెం: ట్రాఫిక్ ఉల్లంఘనలతో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈక్రమంలో ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జూన్ 1వ తేదీ నుంచే నూతన నిబంధనలు అమలు కావాల్సిఉన్నా.. నూతన ప్రభుత్వం ఏర్పాటుతో కొంత జాప్యం జరిగింది. ఈక్రమంలో నిబంధనలు పాటించని వాహనదారులపై నూతన చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని తాజాగా సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

చట్టాన్ని సవరిస్తూ ఉత్తర్వులు..

నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష విధించేలా జీఓ-21 మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 200ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల మేరకు గరిష్టంగా పదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశముంది. గత చట్టంలో కంటే నూతన చట్టంలో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. గతంలో జరిమానాలతో సరిపెట్టేవారు. ఇప్పుడు అదనంగా జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పు చేశారు.

మైనర్‌కు బండిస్తే మూడేళ్ల జైలు..

నూతన చట్టం ప్రకారం మైనరు వాహనం నడిపితే తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తారు. గతంలో కేవలం రూ.1000 జరిమానా విధిస్తూ ప్రతి శుక్రవారం జువైనల్ కోర్టులకు హాజరయ్యేలా నిబంధన ఉండేది. అయితే జరిమానా ఒక్కటే కావడంతో కొంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాలకు కారకులవుతూ వచ్చారు. ఇకపై దీనికి చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వం భారీగా జరిమానాతో పాటు జైలు శిక్షను కొత్త చట్టంలో చేర్చింది. ఈ క్రమంలో వాహన రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేసేలా నిబంధన పెట్టారు.

నూతన చట్టంలోని ప్రధాన అంశాలు..

- మద్యం తాగి వాహనం నడిపితే మొదటి తప్పుగా రూ.10 వేలు జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ. 15 వేల జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష.
- హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కొత్త చట్టం ప్రకారం రూ.1000 జరిమానా.
- లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 5వేలు జరిమానా.
- ఇన్స్యూరెన్స్ లేని వాహనాలు పట్టుబడితే మొదటి తప్పిదానికి మూడు నెలల జైలు శిక్ష, రూ. 2 వేలు, రెండోసారి పట్టుబడితే జైలు శిక్షతో పాటు రూ. 4 వేలు జరిమానా.
- పర్మిట్ లేని వాహనదారులకు రూ. 10 వేలు జరిమానా, ఓవర్‌లోడ్ వేసుకుని వెళితే రూ. 20వేలు జరిమానా.
- వాహన రేసింగ్‌లకు పాల్పడితే మొదటిసారి రూ. 5 వేలు జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా.
- అంబులెన్స్‌లకు దారి ఇవ్వకపోతే రూ. 10 వేల జరిమానా చెల్లించుకోక తప్పదు.
- నిర్దేశించిన దానికంటే ఎక్కువ వేగంగా వాహనం నడిపితే రూ.1000 జరిమానా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా, వాహనం తనిఖీ చేయడానికి నిరాకరిస్తే రూ.750 జరిమానా విధిస్తారు.
- అనవసరంగా హారన్ మోగిస్తే మొదటి తప్పిదానికి రూ.1000 రెండోసారి అదే తప్పిదం చేస్తే రూ. 2 వేలు చెల్లించకోక తప్పదు.
- నిబంధనలకు విరుద్ధంగా హారన్లను తయారు చేసిన కంపెనీలు, విక్రయించిన డీలర్లకు రూ. లక్ష వరకు జరిమానా.
- మైనర్లు వాహనం నడిపి కోర్టుల్లో నిరూపితమైతే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడిని దోషిగా పరిగణిస్తూ రూ. 25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్ సైతం రద్దు చేస్తారు.

ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రతేదీ!

- మంత్రి మనోహర్ ఆగ్రహం
- జిల్లా వైద్యశాల ఆకస్మిక తనిఖీ



శానిటేషన్ సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: వైద్యశాల ఆవరణలో పరిశుభ్రత లేదని, ఇలా ఉంటే కొత్త రోగాలు వస్తాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి జిల్లా వైద్యశాల ఇంజినీరింగ్, శానిటేషన్ సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలి జిల్లా వైద్యశాలను మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందు తల్లిపిల్లల వైద్యశాలలోని అన్ని విభాగాలనూ పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉండడం, ఆస్పత్రి ముందు రోడ్డు పైకి వ్యాపార దుకాణాలు ఉండడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటాయించిన స్థలంలోనే దుకాణాలు నిర్వహించుకోవాలని, రోడ్డు మీదకు రాకూడదని స్పష్టం చేశారు. వారం రోజుల్లో ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా మారాలని ఆదేశించారు. వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. పోస్టుమార్టం గదికి వెళ్ళే దారిలో మట్టి పోసి ఉండటాన్ని గమనించిన ఆయన పీఎంకు వెళ్ళే వారికి అసౌకర్యంగా ఉంటుందని, వెంటనే దానిని తీయించాలని ఆదేశించారు. ఆవరణలో మొక్కలు నాటాలని, ఖాళీ స్థలాన్ని పార్కింగ్‌కు ఉపయోగించుకునేలా ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని, దానికి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్యశాలను పరిశీలించి ఆపరేషన్ థియేటర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్థోపెడిక్ యంత్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ తెనాలి జిల్లా వైద్యశాలకు పూర్వ వైభవం తెస్తామని చెప్పారు. తెనాలి నుంచి ఒక్క కేసూ గుంటూరు వెళ్లకుండా ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, ఆర్ఎంఓ డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ హరిణి, డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 814.90 అడుగుల వద్ద ఉంది.

ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయి వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు ఈనెల 24లోపు సమీపంలోని ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు ప్రభుత్వ ఐటీఐలలో 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్ మార్కుల జాబితా, టీసీ, ఆధార్ జిరాక్స్ కాపీలు, విద్యార్థి ఫొటో, వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

వ్యవసాయ ఇంజినీర్లకు ఉజ్వల భవిష్యత్

వైస్ చాన్స్‌లర్ డాక్టరు ఆర్.శారద జయలక్ష్మి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి

బాపట్ల: వ్యవసాయ ఇంజినీర్లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి పేర్కొన్నారు. డాక్టర్ ఎన్జీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో హాస్టల్ డే కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి మాట్లాడుతూ రైతులకు నేరుగా సేవలు అందించే అదృష్టం వ్యవసాయ విద్యార్థులకు రావటం అదృష్టంగా భావించాలన్నారు. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా రైతులు పొందేవిధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టరు బి.సాంబశివరావు, కళాశాల డీన్ డీడీ స్మిత్, ఎం.శివప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు రాధాకృష్ణారెడ్డి, జి.రవిబాబు, కృపావతి, వీరరాఘవయ్య, బీవీ ప్రసాద్, ఎస్.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్



తాడేపల్లిరూరల్ : కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ఇసుక దొరక్క భవననిర్మాణ కార్మికులతోపాటు యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 56 రీచ్‌లు ఉన్నాయని, వాటిలో 36 రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో సీపీఎం పట్టణ, రూరల్ కార్యదర్శులు బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొట్టె కరుణాకరరావు, వేముల దుర్గారావు, పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విద్యాభవన్ కార్యదర్శిగా పీఆర్ రాజు



రామచంద్రరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ హేమాంబ

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్స్ కార్యదర్శిగా పి.రామచంద్రరాజు నియమితులయ్యారు. ఈమేరకు ముంబైలోని భారతీయ విద్యాభవన్స్ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. రామచంద్రరాజు మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ సూచన ప్రకారం నాటి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త కేఎం మున్షీ 1938లో బొంబాయి నగరంలోని అంధేరీలో మొదటి భారతీయ విద్యాభవన్ కేంద్రాన్ని స్థాపించారని వివరించారు. విద్యావసతులు లేని నాటి కాలంలో భారతీయ విద్యాభవన్స్ ద్వారా పౌరులకు దేశ సంస్కృతి, సంప్రదాయాలతోపాటు నైపుణ్యం కలిగిన ఆధునిక విద్యను నేర్పించి, ఉన్నత విలువలతో జీవన ప్రమాణాలు సాగించేలా తీర్చిదిద్దారని చెప్పారు. విద్యాభవన్స్‌కు తాను రెండో సారి కార్యదర్శిగా నియమితుడినైనట్టు వివరించారు.

సెక్స్ వర్కర్లపై చిన్నచూపొద్దు

- అందరికీ గౌరవంగా జీవించే హక్కు ఉంది
- జిల్లా జడ్జి పార్థసారథి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, చిత్రంలో కార్యదర్శి లీలావతి తదితరులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సెక్స్ వర్కర్లను చిన్నచూపు చూడొద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి చెప్పారు. గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంగ్రామ్ సంస్థ అండ్ లక్ష్మీ భానుశ్రీ సర్వీస్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ భాగస్వామ్యంతో మంగళవారం సుప్రీంకోర్టు జడ్జిమెంట్ బుద్ధదేవ్ కర్మస్కర్ వర్సెస్ ది స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ అండ్ అదర్స్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సంస్థ జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి అధ్యక్షత వహించారు. సెక్స్ వర్కర్లకు సంబంధించి హక్కులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి మాట్లాడుతూ ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా, మర్యాదగా జీవించే హక్కు ఉందన్నారు. సెక్స్ వర్కర్స్ పిల్లలపై ఎలాంటి వివక్ష చూపొద్దని కోరారు. ప్రభుత్వం నుంచి వారికి అందాల్సిన హక్కులు చట్ట ప్రకారం అందుతాయని చెప్పారు. డీఎస్పీ బి.వి.సుబ్బారావు మాట్లాడుతూ చట్టాలలో మహిళలకు కల్పించిన హక్కులన్నీ సెక్స్ వర్కర్లకు వర్తిస్తాయని వివరించారు. కేసులకు సంబంధించి వారికి చట్టపరమైన న్యాయం పొందే హక్కు ఉందన్నారు. సెక్స్‌వర్కర్లు జీవనోపాధి కోసం ఇతర పనుల్లో తర్ఫీదు పొంది వృద్ధిలోకి రావాలని సూచించారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలను జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ వివరించారు. ఈ సదస్సులో సంగం ఆర్గనైజేషన్ నుంచి రాజేష్, శ్రీనివాస్, ఎల్‌బీఎస్‌డీఎస్ నుంచి పి.దేవి, సి.హెచ్.విజయ్‌కుమార్ (డీసీపీఓ, డీడబ్ల్యూసిడబ్ల్యూ ఈఓ), దివ్యాంగులు, వృద్ధుల శాఖ ఏడీ సువార్త పాల్గొన్నారు.

గుంటూరు వైద్య విద్యార్థికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి



అవార్డు అందుకుంటున్న డాక్టర్ డానియల్ ఫిన్ని

గుంటూరు మెడికల్: ఇళ్లలో కట్టెల పొయ్యి లేదా, గ్యాస్ పొయ్యిపై వంట చేసే సమయంలో వెలువడే కాలుష్య కారకాల వల్ల శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎంత మేరకు వస్తున్నాయనే విషయంపై పీజీ వైద్య విద్యార్థి చేసిన పరిశోధనకు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. చెట్టినాడ్ హాస్పిటల్–రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో చెన్నైలో జూన్ 28న జరిగిన నేషనల్ చెట్‌కామ్ కాన్–2024 జాతీయ సదస్సులో పీజీ వైద్య విద్యార్థి అవార్డు అందుకున్నారు. గుంటూరు జిల్లాలోని కాటూరి మెడికల్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం సామాజిక వైద్య విభాగం వైద్య విద్యార్థి డాక్టర్ సంకూరు డానియల్ ఫిన్ని ఈ పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ప్రత్తిపాడులో సుమారు ఆరు నెలల పాటు వంద ఇళ్లల్లో వంట చేసే సమయాల్లో వస్తున్న కాలుష్యంపై పరిశోధనలు చేసి నేషనల్ కాన్ఫరెన్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. పల్లెటూళ్లలో 'ఇండోర్ ఎయిర్ పొల్యూషన్'పై చేసిన పరిశోధన పత్రానికి ఓరల్ ప్రెజెంటేషన్ విభాగంలో జాతీయ స్థాయి ప్రథమ బహుమతి లభించింది. జాతీయ స్థాయి అవార్డు అందుకున్న డాక్టర్ డానియల్ ఫిన్నిని మంగళవారం కాటూరి వైద్య కళాశాల చైర్మన్ కాటూరి సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ స్వైరా రావు, డీన్ డాక్టర్ కె.వరప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి.ఫణీంద్ర తదితరులు అభినందించారు.

జొన్నలగడ్డలో సమగ్ర వ్యవసాయ యాజమాన్య అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో రైతులు, విద్యార్థులతో కేవీకే శాస్త్రవేత్త గంగాదేవి తదితరులు

గుంటూరు రూరల్: సరైన సమయంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి మంచి పంట దిగుబడులు సాధించవచ్చని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం అగ్రానమీ శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి తెలిపారు. మంగళవారం జొన్నలగడ్డ గ్రామంలో సమగ్ర వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై గ్రామంలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం గురించి తెలిపారు. అగ్రికల్చర్ విద్యార్థులు ఒక్కొక్క విద్యార్థి ఒక్కొక్క రైతును స్వీకరించి ఒక పంట కాలం, మొత్తం రైతు దినచర్య, వ్యవసాయ విధానాలను దగ్గర నుంచి పరిశీలించాలన్నారు. రైతులు నూతన సాంకేతిక వ్యవసాయ పద్ధతులు ఆచరించినట్టయితే అలాంటి విధానాలు అందరి రైతులకు చేరేలా చూడాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ యాజమాన్య పద్ధతులను పరిశీలించారు. వీఏఏ వి.ఆనందబాబు, గ్రామ ఉపసర్పంచ్ నామా శ్రీనివాసరావు, వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేధింపులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం

నరసరావుపేట: రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చిరు ఉద్యోగులైన అంగన్వాడీలపై వేధింపులకు పాల్పడుతోందని ఇప్పటికైనా అటువంటి చర్యలు మానుకోపోతే ఊరుకునేదిలేదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపు ఇస్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ హెచ్చరించారు. మంగళవారం నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డు పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ప్రాజెక్టు లీడర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి అధ్యక్షత వహించారు. సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఒకటవ తేదీన వేతనాలు ఇచ్చినందుకు సంతోషపడాలో, నూతన ప్రభుత్వ వేధింపుల పట్ల బాధపడాలో అర్థం కాని పరిస్థితుల్లో అంగన్వాడీలు ఉన్నారన్నారు. ప్రతిపక్ష హోదాలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమ్మె శిబిరాలను సందర్శించిన టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరించి అండగా ఉంటామని హామీ ఇచ్చారని వివరించారు. అంగన్వాడీల ఓట్లతో అధికారంలోకి వచ్చాక అదే అంగన్వాడీలపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే అనేకమంది అంగన్వాడీలను టీడీపీ నాయకులు బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి రాజీనామాలు చేయించారని, వేధింపులు తాళలేక ఒక అంగన్వాడీ కార్యకర్త గుండెపోటుకు గురైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని చిరుద్యోగులపై కక్షపూరిత రాజకీయాలు ఆపాలని ఉద్యోగాలు చేసుకునే విధంగా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్



కౌలురైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

రేపల్లె రూరల్: కౌలు రైతులకు భూ యజమాని సంతకం నిబంధన తొలగించి గ్రామసభల ద్వారా సీసీఆర్ కార్డులను ప్రభుత్వం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘ బాపట్ల జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ అన్నారు. కౌలు రైతుల సమస్యలపై కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మోటార్ సైకిల్ ప్రచార యాత్ర మంగళవారం రేపల్లె పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రామసభల ద్వారా సీసీఆర్ కార్డులు ఇవ్వాలని, కార్డు వచ్చిన ప్రతి ఒక్కరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల కౌలురైతు కుటుంబాలను ఆదుకునేందుకు ఈ యాత్ర చేపట్టామన్నారు. ఈసందర్భంగా మండలంలోని ఉల్లిపాలెం, నల్లూరిపాలెం, సింగుపాలెం, విశ్వేశ్వరం, చాట్రగడ్డ, పెనుమూడి, పేటేరు, బేతపూడి గ్రామాల్లో బైక్‌యాత్ర నిర్వహించి కౌలు రైతులతో సమస్యలపై చర్చించారు. వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా నాయకులు బి.అగస్టీన్, సీహెచ్ మణిలాల్, పి.మనోజ్, కె.గోపి, వి.మావో, కె.రమేష్, డి.బాబురావు, జి.రాహేలు, కేవీ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో కోళ్ల వాహనం బోల్తా

- వాహనంతోపాటు డివైడర్ ధ్వంసం
- వాహనంలో తరలిస్తున్న కోళ్లు వెయ్యికి పైగా మృ త్యువాత



హైవే జంక్షన్ వద్ద బోల్తా పడిన కోళ్ల లారీ

యద్దనపూడి: 16వ నంబర్ ఎక్స్‌ప్రెస్ హైవే డివైడర్‌పై అడ్డంగా ఐచర్ వాహనం పడటంతో పెనుప్రమాదం తప్పింది. వాహనంలోని డ్రైవర్, క్లీనర్‌లు సురక్షితంగా బయటపడగా అందులో తరలిస్తున్న కోళ్లు భారీగా మృత్యువాత పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...విద్యార్థులతో హైవేపై ప్రయాణిస్తున్న స్కూల్‌బస్ మండలంలోని తిమ్మాపురం హైవే జంక్షన్ వద్దకు రాగానే స్లో అయింది. బస్సు వెనుకే వేగంగా వస్తున్న ఐచర్ వాహనం డ్రైవర్ గమనించి షడన్ బ్రేక్ వేశాడు. అదే మార్గంలో వేగంగా దూసుకువచ్చిన గుర్తు తెలియని ట్యాంకర్ ఐచర్ వాహనాన్ని ఢీకొంది. దీంతో ఐచర్ వాహనం హైవే డివైడర్‌పై అడ్డంగా పడింది. ఢీకొట్టిన ట్యాంకర్ నిలుపుదల చేయకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఐచర్ వాహనం డ్రైవర్, క్లీనర్‌లు సురక్షితంగా బయటపడగా, వాహనం, డివైడర్‌లు ధ్వంసం అయ్యాయి. వాహనంలోని 2వేల కోళ్లలో సగానికి పైగా మృతి చెందాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హైవేపై అడ్డంగా ఉన్న వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

'ఆళ్లకు' తెలుగు భాషా సేవా పురస్కారం

ఈనెల 7న పలమనేరులో ప్రదానం



ఆళ్ల నాగేశ్వరరావు

తెనాలి: చిత్తూరు జిల్లా, పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళామందిరం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అందజేస్తున్న తెలుగు భాషా సేవా పురస్కారానికి తెనాలికి చెందిన కవి/రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఈనెల 7న పలమనేరులోని సాయి గార్డెన్ సిటిలోగల కళామందిరంలో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తులసినాదం నాయుడు, ప్రధాన కార్యదర్శి కె.పుష్ప సమాచారం అందజేశారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి అమర్నాథ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 17 మంది భాషా సేవకులను ఈ పురస్కారంతో సత్కరించనున్నారు. తెలుగు భాషా వికాసానికి నాలుగు దశాబ్దాలుగా ఆళ్ల నాగేశ్వరరావు చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారానికి ఎంపిక చేశారు. ఆళ్ల నాగేశ్వరరావు ప్రస్తుతం గుంటూరు–2 డిపోలో ఆర్టీసీ కండక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రవృత్తిగా సాహిత్య రచనలో కొనసాగుతున్నారు.

సెంచరీలతో చెలరేగిన బ్యాట్స్‌మెన్

విశాఖ భారీ స్కోర్



సెంచరీలతో రాణించిన పూర్ణచంద్, భానుశ్రీ హర్ష

మంగళగిరి: బ్యాట్స్‌మెన్ సెంచరీలతో చెలరేగిపోవడంతో విశాఖ జట్టు భారీ స్కోర్ సాధించింది. అమరావతి టౌన్ షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏసీఏ అండర్–16 మల్టీ డే ఇంటర్ పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం విశాఖపట్నం–శ్రీకాకుళం జట్టు మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచిన శ్రీకాకుళం జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు క్రికెటర్లు సెంచరీలు, అర్ధ సెంచరీలతో చెలరేగడంతో 91 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 362 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఎ.పూర్ణచంద్ రెండు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 105 పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ 8 ఫోర్లతో 101 పరుగులు చేశాడు. వి.సి.హెచ్.శ్రవన్ కుమార్ 5 ఫోర్లతో 52 పరుగులతో అర్ధసెంచరీ సాధించాడు. దీంతో విశాఖ జట్టు భారీ స్కోర్ సాధించింది. శ్రీకాకుళం జట్టు బౌలర్లు కె.మనీష్, సాయి వెంకట ప్రణీత్ చెరో రెండు వికెట్లు తీశారు.

భారీ స్కోర్ దిశగా చిత్తూరు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న అండర్–16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా మంగళవారం చిత్తూరు, కర్నూలు జిల్లా జట్ల మధ్య మూడో మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు నష్టానికి 361 పరుగులు చేసింది. జట్టులోని నవధీర్ సాహస్‌నిహాల్ 107 బంతుల్లో 100 పరుగులతో సెంచరీ చేశాడు.

అమరేశ్వరా.. ఈ కౌలు ఏ పాలు?!

- పొరుగు రాష్ట్రంలో అమరేశ్వరుని భూములకు పెరగని కౌలు ధరలు
- 410.34 ఎకరాలకు దక్కుతోంది స్వల్పమే
- ఎకరాకు వెయ్యి రూపాయలే కౌలు!



అమరేశ్వరుడు

అమరావతి: పంచారామక్షేత్రాలలో ప్రథమారామమైన అమరావతి అమరేశ్వరునికి ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలో ఉన్న 410.34 ఎకరాలకు ఓటు బ్యాంకు రాజకీయం, గ్రామంలో రైతుల ఏకమైన కారణంగా అమరావతి అమరేశ్వర స్వామి కౌలు ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఏటా పంటలూ పండించుకుంటూ ఆదాయాన్ని పొందుతున్న రైతులు ఎకరాకు రూ.1000 లకు మించి కౌలు ఇవ్వడం లేదు. గ్రామంలో మిగిలిన పొలాలకు కనీసం 5000 నుంచి 7000 రూపాయల కౌలు ప్రకారంగా ఏడాదికి సుమారు 20 నుంచి 30 లక్షల రూపాయలు కౌలు ఆదాయం రావాల్సి ఉంది. గత పదిహేనేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. ఈ కారణంగా అమరేశ్వరునికి కోట్లాది రూపాయల కౌలు ఆదాయానికి గండి పడుతోంది. బహిరంగ వేలంతో ఆదాయం పెంచుకునేందుకు అధికారులు చేసిన కృషి తెలంగాణ రాజకీయ నాయకుల పలుకుబడి ముందు ఫలించ లేదు. రైతులకు సహకరించకపోతే ఓట్లు పోతాయనే భయంతో అధికారులపైనే వత్తిడి తీసుకువచ్చి గ్రామసభ ద్వారా మధ్యే మార్గంగా నామమాత్రంగా కౌలు చెల్లిస్తున్నారు. అదే గ్రామంలో ఎకరాకు రూ.5 నుండి 10 వేల కౌలు ఉంటే అమరేశ్వరుని భూములకు మాత్రం వెయ్యి రూపాయలే కౌలు ఉండటం విడ్డూరం

విరాళమిచ్చిన భూములపై అధికారుల నియంత్రణ శూన్యం క్రీ.శ 17 శతాబ్దంలో అమరావతిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు స్వామివారి నిత్యధూప, దీప నైవేద్యాలకు ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలోని 410.34 ఎకరాల మాన్యాన్ని అందించారు. కాలక్రమేణా వాసిరెడ్డి వంశస్తుల అజమాయిషీలో మాన్యం కౌలు ద్వారా వచ్చిన ఆదాయాన్ని స్వామివారి సేవలకు వినియోగించారు. 19వ శతాబ్దంలో దేవదాయ, ధర్మాదాయశాఖ పరిధిలోకి వచ్చిన తరువాత భూముల వేలం పాటలపై అధికారులు తమ విధులపట్ల నిర్లక్ష్యం వహించడంతో ఆ భూములకు రైతులు కొన్నాళ్లు కౌలు చెల్లించకుండా పండించుకున్నారు. ఈ నేపథ్యంలో కొందరు దేవదాయశాఖాధికారులు చేసిన ప్రయత్నాలతో ఎకరాకు రూ.200 నుంచి రూ.400 వరకే కౌలు చెల్లించారు. ఎంతో విలువైన భూముల నుంచి నామమాత్రపు ఆదాయం లభిస్తుందని గ్రహించిన దేవాదాయశాఖ ఉన్నతాధికారులు 2009లో తమ శాఖలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుసుమ కుమారిని విచారణాధికారిగా నియమించారు. దెందుకూరు గ్రామంలోని ఇతర భూములకు, దేవాలయ భూముల కౌలుకు వ్యత్యాసం ఉందని, ఏటా లక్షలాది రూపాయల ఆదాయాన్ని దేవాలయం కోల్పోతుందని విచారణాధికారి ప్రభుత్వానికి నివేదిక అందచేశారు.

కౌలు తగ్గింపులో ఏకమైన గ్రామం!

మాములుగా పార్టీలపరంగా, వర్గాలపరంగా, వ్యక్తులపరంగా విడివిడిగా ఉండే గ్రామస్తులు దేవుడు భూముల కౌలు విషయంలో మాత్రం ఐక్యంగా ఉండటం విచిత్రంగా ఉంది. దీన్ని ఆధారంగా చేసుకుని 2011వ సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం దెందుకూరు గ్రామంలోని భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. దీని ప్రకారం దెందుకూరులో తొలుత అధికారులు స్వామివారి భూముల కౌలుకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామం మొత్తం ఒకటిగా ఏకమై బహిరంగ వేలం పాటల్లో రైతులు పాల్గొనకుండా అడ్డుకున్నారు. ఎవరైనా వేలంలో పాడితే సాగునీటి వనరులు, పొలాల్లోకి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు వెళ్లడానికి అడ్డగిస్తామని ఇతర గ్రామాల రైతుల్ని బెదిరించడంతో ఎవరూ వేలం పాటల్లో పాల్గొనలేదు. ఆ తరువాత రెండో విడత మండల కేంద్రమైన మధిర తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించగా దేవుడు భూములు సాగు చేస్తున్న రైతుల కుటుంబాల ఓట్లు పోతాయనే భయంతో అనాటి పాలకులు రంగ ప్రవేశం చేసి వేలం పాటలు జరుగనివ్వలేదు. తర్వాత గ్రామస్తులతో కూడిన సయోధ్యతో 2012లో నిర్వహించిన గ్రామసభలో ఎన్నో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న కుటుం బాలు ఈ వేలం వల్ల నష్టపోతారని గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు దేవదా యశాఖాధికారులపై వత్తిడి తెచ్చి ఎకరాకు నాలుగు వందల నుంచి వెయ్యి రూపాయలకు కౌలు పెంచి మూడేళ్లకు ఒకే కౌలు ఉండే విధంగా రాజీ కుదిర్చారు.

రావాల్సింది కొండంత, చెల్లించింది గోరంత

ఈ నిర్ణయం మేరకు గ్రామంలో దేవాలయానికి చెందిన భూములను కౌలుకు చేసే సుమారు 250 మంది రైతుల నుండి సంవత్సరానికి 4,10,340 చొప్పున మూడేళ్లకు 12,31,020 రూపాయల కౌలు ఆదాయం వస్తుంది. ప్రస్తుత మార్కెట్ కౌలు రేట్ల ప్రకారం మూడేళ్లకు 60 నుంచి 90 లక్షల రూపాయలకు పైగా రావల్సిన అదాయం 12.31 లక్షలతో సరిపెట్టు కోవాల్సి వచ్చింది. రాష్ట్రం మొత్తం మీద ఏ ప్రాంతంలోనైనా ఎకరాకు కనీసం కౌలు రేట్లు ఐదువేల నుంచి 7వేల వరకు ఉంటే ఇక్కడ మాత్రం ఎకరాకు వెయ్యి రూపాయలకు నిర్ణయించడం వల్ల స్వామివారి ఆదాయానికి లక్షల్లో గండి పడినట్లయింది. దెందుకూరులో మిగిలిన రైతుల సొంత భూములకు మాత్రం ఐదువేలకు పైగా కౌలు పలికినా అనాటి నుండి ఈనాటి వరకు అమరేశ్వరుని భూములకు వెయ్యిరూపాయలు కౌలు ఉండటం విశేషం.

పరిహారం అమరేశ్వరునికే..!

అమరేశ్వర దేవస్థానంనకు చెందిన సుమారు 20 ఎకరముల భూమి ఖమ్మం– హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేకోసం భూ సేకరణ చేయటం జరిగింది. భూములు దేవుడిపేరున ఉన్నా రైతుల ఆధీనంలో ఉండటంలో పరిహారం విషయంలో వివాదం తలెత్తింది. ఈక్రమంలో ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ అధికారులు దేవుని భూములను భూసేకరణ చేస్తే పరిహారం అమరేశ్వరునికే చెందాలని వివిధ స్థాయిలలో కృషి చేయటం న్యాయస్థానాన్ని ఆశించటంతో నేషనల్ హైవే అథార్టీ కూడా పరిహారం అమరేశ్వరునికి చెల్లించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

బహిరంగ కౌలుకు ఏర్పాట్లు

గతంలో దేవదాయశాఖాధికారులు, రెవెన్యూ అధికారులు సమక్షంలో నిర్ణయించిన కౌలు సొమ్ము చెల్లింపులలోనే ఇంకా కొంత మొత్తం రైతులు బకాయి చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క దృష్టికి బహిరంగకౌలు వేలం విషయం తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దెందుకూరులో బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–వేమూరి గోపీనాథ శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి